# చింతచెట్టు నీడలో వెచ్చని పరిమళపు పాట



తొలివాన కురిసినప్పుడు నేలలోంచి పుబికి వెచ్చగా వొచ్చే మట్టివాసన కమ్ముకొంటున్నట్టు ఆ పాట మెల్లమెల్లగా చుట్టుకొంటోంది...

యెయిర్‌పోర్ట్‌కి వెళ్ళే దారి నుంచి కుడివైపుకి తిరిగి వో రెండు కిలోమీటర్లు లోపలికి వెళితే రైలులైను దాటితే హుస్సేన్‌సాగర్.

ఆ రైలులైనుకి ఆ మెయిన్ రోడ్డుకి నడుమ చిన్న కాలనీ. ఆ కాలనీలో అన్నీ యిండిపెండెంట్ యిళ్ళే. ఆ కాలనీకి దక్షిణం వైపు విశాలమైన ఆకుపచ్చ తోట. ఆ తోట చివర్న పశ్చిమాన పురాతన సౌధం. ఆ సౌధంలో రాత్రంతా వొంటరి వీనస్‌లా వెలుగుతుండే చిన్ని విద్యుత్ దీపం. ఆ తోటకి కుడివైపునున్న సన్నని కాలిబాటకి వో పక్కంతా యేపుగా పెరిగిన లేతాకుపచ్చ యూక్లిప్టస్ తోట. ఆ తోటకి ఆనుకొని చిన్ని రేకుల యిల్లు. ఆ రేకుల యింటికి యెదురుగా పురాస్మృతు లెన్నింటినో నిండుగా నింపుకొంటూ యేపుగా పెరిగిన చింతచెట్టు శాఖోపశాఖ లుగా. ఆ చింతచెట్టు నీడ వొత్తుగా పరుచుకొన్న చోట పాత నులకమంచంపై నర్సింతాత పడుకొని వున్నాడు. నిలువెత్తు మనిషి...

ఆ నిలువెత్తు మనిషి చుట్టూ యెటు చూసినా పిల్లలే పిల్లలు. జేగురు రంగు తిరిగిన తెల్లని తలపాగా చుట్టూ నడిచి నడిచి స్థిరపడిన బొబ్బలు కట్టిన పాదాల చుట్టూ బొజ్జ మీదా మొత్తంగా అతని చుట్టూ యెటు చూసినా పిల్లలే పిల్లలు. అతను కథ చెపుతూ నిద్రలోకి జారుకున్నాడు. ఆ నిద్ర బరువైన వూపిరిగా చిన్న గురగ్గా మెల్లమెల్లగా ఫ్యాక్టరీలో సైరన్‌లా యెక్కువవుతుంటే పిల్లల బుగ్గల నిండా నవ్వులే నవ్వులు. యిళ్ళలో పనివేళయిందని వెళ్ళేవాళ్ళు, ఆ యిళ్ళ పనుల్నుంచి తిరిగొచ్చేవాళ్ళు, తల్లో పేలు చూపించుకొంటున్నవాళ్ళు, చూస్తున్న వాళ్ళు, కబుర్లు చెప్పుకొంటున్నవాళ్ళు, గొడవ చేబాకండి తాతయ్యని పడుకోనీ యండి అని పిల్లలపై అరుస్తూనే ఆ గురక్కి ముసిముసిగా నవ్వుకుంటున్న స్త్రీలు. ఛాయ్ తాగే వేళకి గురక కట్టిపెట్టి నర్సింతాత, 'ఆఁ... మేకల్ని పోరగాడు తోలుకెల్తు...' కథ ఆపిన చోట నుంచి మొదలుపెట్టాడు. కథ చెపుతూచెపుతూ నిద్రలోకి వెళ్ళి మెలకువ రాగానే ఆపిన చోట నుంచి నర్సింతాత యెలా మొదలు పెడతాడాని రేలాకి బోల్డంత కుతూహలం. ఆశ్చర్యం. తాతలా తను కథ చెపుతూ నిద్రలోకి వెళ్ళి మెలకువ రాగానే కథ చెప్పాలని ప్రయత్నించినా అలా చెప్పలేక పోయింది. 'తాతంత అయ్యాక అలా కథ చెప్పగలనులే,' అనుకొంది.

సాయంకాలపు ఆఖరి సూర్యకాంతి ఛాయ కూడా తెరమరుగయ్యే వేళ యిళ్ళకి చేరుకొనే పెద్దాళ్ళు. యింటి వెనగ్గా యూక్లిప్టస్ చెట్లకి పక్కగా వున్న వేపచెట్టు కింద వేడినీళ్ళతో చల్లనీళ్ళతో స్నానాలు చేయటం. కణకణలాడే బొగ్గుల పొయ్యి మీద పెళపెళలాడే జొన్నరొట్టెలు చేస్తుంటే ఆ పొయి చుట్టూ చిన్నాళ్ళు పెద్దాళ్ళు చేరి సందడి సందడిగా కమ్మని పప్పు జొన్నరొట్టెలు తింటూండేవారు. దోమలు తగ్గడానికి నెగడు వేసేవాళ్ళు. దాని చుట్టూ చేరి కబుర్లు చెప్పుకొంటూ పాటలు

పాడుతూ డప్పు దరువు వేసేవాళ్ళు. పాట వెనక పాట... యీ కోలాహలాన్నంతా ఆ పాత నులకమంచంపై పక్కకి తిరిగి మోచేతిపై తలాన్చి మురిపెంగా చూసుకొనేవాడు నర్సింతాత.

పెళ్ళయిన కొత్తలో యిక్కడికొచ్చాడు పాలమూరు నుంచి. అప్పటికిదంతా అడివి లెక్కనుండేది. కాలనీలో యిళ్ళు రావటం వాళ్ళకి పనిచేయటం. అప్పట్నుంచి యిక్కడే. పిల్లలు వాళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళ పిల్లలు... యిప్పటికి కాలనీ నిండా యిళ్ళు. స్కూల్స్, పెద్దపెద్దాళ్ళుండే కాలనీగా. ఆ రైలుకట్ట కింద దుకాణాలు. హుస్సేన్‌సాగర్ స్టేషన్ దాటితే చూస్తుండగానే సాగర్ చుట్టూ రోడ్డు... నెక్లెస్‌రోడ్డు... నెక్లెస్ రోడ్డు మిలమిలాడుతూ విద్యుద్దీపాలు అలా ఖైరతాబాద్ వైపు వెళితే పెద్దపెద్ద ఫ్లైవోవర్లు. యీ కాలనీలో యిళ్ళస్థలాలకి గిరాకి పెరగటం, నర్సింతాత అద్దెకి యిళ్ళు చూపించటం, అమ్మకానికుండే స్థలాలు చూపించటం. కొడుకులు కన్‌స్ట్రక్షన్ కంపెనీలలో పని. కోడళ్ళు, కూతుర్లు యిళ్ళలో పని. యెప్పుడో వేసుకొన్న చిన్ని యిల్లు సర్కారోళ్ళది. నర్సింతాతని నమ్ముకొని యేదో వొక పని దొరుకుతుందని ఆ వూరి నుంచి సిటీకొచ్చేవాళ్ళు యీ పదేళ్ళలో మరీ యెక్కువయ్యారు. అందరికీ యేదో వొక పని చూపించే నర్సింతాతంటే దేముడే మరి.

యెలక్షన్ యేజంట్ నర్సింతాత దగ్గరున్న వోట్లు లెక్కపెట్టాడు. ఆ వోట్లని తను చెప్పిన నాయకుని పార్టీకి వేస్తే యింటి పట్టా యిప్పిస్తానన్నాడు. వొక్కసారి వోట్ల లిస్ట్‌లో వొస్తే తనని అక్కడ నుంచి యే సర్కారోళ్ళు తరిమేయలేరని నర్సింతాతకి గట్టిగా నమ్మకం కుదిరింది. స్థలాల రేట్లు బాగా పెరిగాయి. యేదో వొక పార్టీ యేజంటుని నమ్ముకోకపోతే యేదో వొకరోజు తనున్న యింటికి ముప్పు రావొచ్చనిపించింది నర్సింతాతకి.

ఆరోజు యెప్పట్లానే నర్సింతాత యింత తిని పిల్లలందరిని చుట్టూ వేసుకొని పాటలు నేర్పిస్తూ మధ్యమధ్య కథలు చెపుతున్నాడు. రేలా గొంతెత్తి పాడుతుంటే ఆ లేతస్వరం ఆ చింతచెట్టు శాఖల్లోంచి కోయిలమ్మలు మౌనంగా ఆ పాటని మేస్తున్నాయ్.

అప్పుడొచ్చారు వాళ్ళు.

వాళ్ళని చూసి రేలా పాట ఆగింది.

వేసవి తొలి యెండకి అలసి ఆ చెట్టు నీడన విశ్రమించిన మేకలు బెదిరి మేమే

మన్నాయి. పిల్లలంతా కథలు, పాటలు మరిచి ఆత్రంగా వాళ్ళనే చూస్తున్నారు. సిల్కు లాల్చీ, యెడమ చేతికి తళతళలాడే బంగారు గొలుసు, ఆ చేతివేళ్ళకి రెండేసి వుంగరాలు, కళ్ళకి నల్లని జోడు. ఘుమఘుమలాడుతూ రెపరెపలాడుతూ వాళ్ళు వచ్చారు.

వస్తూ వస్తూ పెద్దాయన, "యీ యిల్లు యెవరిది?" అని అడిగాడు.

"నాదే బాబయ్యా."

"మంచిది మంచిది. యీ స్థలంలో అపార్ట్‌మెంట్ కడుతున్నాం. రేపట్నుంచి పని మొదలుపెడతాం. మా సూపర్‌వైజర్ యిక్కడే వుంటాడు. కాస్త చూసుకో, కొత్త కదా," అన్నారు వాళ్ళు. నర్సింతాత నమ్రతగా తలాడించాడు.

"కానీయండి. మేం బయలుదేరుతాం," అన్నారు వాళ్ళు.

గొడ్డలితో చింతచెట్టు వైపు పనివాళ్ళతో సూపర్‌వైజరు వచ్చాడు.

"యిదేంటయ్యా," నర్సింతాత అడిగాడు.

"చింతచెట్టు అడ్డయ్యా, పునాదికి దెబ్బ."

"మీ స్థలం అక్కడుంది. చెట్టు యిక్కడుంది," తాత గిలగిలలాడుతున్నాడు.

"వేళ్ళు పాకుంటాయి. పునాదికి దెబ్బ. యీ వూడలు చూడు. అసలీ చెట్టుంటే వెంటిలేషన్ సమస్య. ఆ వేపచెట్టు, యీ చింతచెట్టు కొట్టాల్సిందే. రేపట్నుంచి స్థలంలో పని," అన్నారు వాళ్ళు.

నర్సింతాత ప్రాణం విలవిలలాడింది.

చెట్టుని నరుక్కోవటం యేంటి. వేళ్ళు పునాదికి నష్టం చేయడం యేంటి. వేళ్ళు నరుక్కోవడం యేంటి. తరతరాలుగా వస్తున్న చెట్టు. నర్సింతాత చూస్తుండగానే ఆ నడిరాత్రికి సగం చెట్టుని నరికేశారు.

పాటలు లేవు. నెగడు లేదు. ఆ ప్రాంతమంతా పెట్రోమాక్స్ లైట్ల వెలుగు. పిల్లలతా దిగులుదిగులుగా వో మూల గుంపుగా కూర్చున్నారు. ఆ రాత్రి నర్సింతాత రొట్టెలు తినలేదు. తన తల్లి, భార్య పోయిన రోజు దు:ఖపడిన దానికి రెట్టింపు దు:ఖం అతనిని కమ్ముకొంది.

తెల్లారేసరికి నర్సింతాత యిల్లొక్కటే బోడిగా కనిపించింది. కొన్ని సంవత్సరాలుగా అలవాటుపడిన చింతచెట్టు నీడ జీవనం కాస్తా మండుటెండలో పడేసరికి నర్సింతాత కొండంత అండని కోల్పోయినట్టు దిగులయ్యాడు. చూస్తుండగానే నేల చదును చేసి పునాదులు వేశారు. స్లాబ్ పోశారు. ఆ యిసుక సిమెంట్ ధూళికి నర్సింతాత పెద్దోళ్ళు పిల్లలు అలవాటు పడిపోయారు. నర్సింతాత దిగులుగా చింతచెట్టు మొదల్లో రాత్రివేళ పడుకునేవాడు.

"అపార్ట్‌మెంటాళ్ళకి మంచినీళ్ళ కనెక్షన్ వేస్తున్నారంట. మనకి యిక్కడ వీధిపంపు వేస్తారేమో కనుక్కోరాదా," నర్సింతాతని వోరోజు కోడలు అడిగింది.

నీళ్ళుంటే కాస్త తెరిపిగా వుంటుందని నర్సింతాత రాజకీయ యెలక్షన్ యేజెంట్ దగ్గరికి వెళ్ళాడు. యేజెంట్, 'ఆ అదేమంత భాగ్యం,' అంటూ ఆ పని చేయిస్తానన్నాడు. యెలక్షన్స్ అట్టే దూరం లేవనే ముందుచూపు వుందా యేజెంట్‌కి.

అక్కడో పబ్లిక్ కుళాయి వచ్చింది. ఆ నియోజకవర్గం యెమ్మెల్యే ఆ పంపుని వోపెన్ చేసినట్టు వో సిమ్మెంటు పలకపై రాయించి ఆ కుళాయికి అతికించాడు యేజెంట్.

'యెమ్మెల్యే రాకుండానే వచ్చినట్టు రాయించారే,' అనుకొంది రేల. చూస్తుండగానే అపార్ట్‌మెంట్ నిట్టనిలువుగా నిలబడింది. వొక్కొక్కరే గృహప్రవేశం చేస్తున్నారు. గృహప్రవేశం జరిగే ప్రతిసారీ కిక్కిరిసిన కార్లు బారులు బారులుగా. ఆరోజు వో వంక గృహప్రవేశం జరుగుతోంది. రాజకీయ ఏజెంట్ వచ్చాడు.

"రోజులన్ని వొక్కలానే వుండవ్ పెద్దాయనా. యీ చివర్నుంచి ఆ చివరికి అలా వదిలేస్తే మరొకరొచ్చి యిల్లేసుకుంటారు. నువ్వుండగా యిలా సఖ్యంగా వున్న నీ పిల్లలంతా రేపా జాగా కోసం తగువులాడుకుంటారు. నువ్వుండగానే యెవరి యిల్లు వాళ్ళకి వేయించుకొంటే స్థలానికి స్థలం, అంతా పక్కపక్కనే వుండొచ్చు. యేమంటావ్?"

"సర్కారు... అయినా పోరగాళ్ళు వేసుకుంటారో లేదో."

"సర్కారు సంగతి నేనున్నాను కదా. యేదో కాస్త యిస్తే," అన్నాడు యేజెంట్. రెండు రాత్రులు అంతా కూర్చుని యెవరి గది వాళ్ళు వొకదానికొకటి ఆనుకొని కట్టుకోవాలని నిశ్చయించుకున్నారు. యేజెంట్‌కి అప్పు చేసి అంతా డబ్బులు అప్పజెప్పారు.

రెండ్రోజుల్లో యిరవై కాపురాలుగా నర్సింతాత పరివారమంతా యెవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

"మీరిలా ఆక్రమించుకొంటే యెలా... యిది గవర్నమెంట్ ల్యాండ్," అంటూ అపార్ట్‌మెంట్‌లోని వొకాయన తగాదాకి వొచ్చాడు.

"యేదో పేదళ్ళం. వదిలేయండి," అంటూ నర్సింతాత బతిమాలుకున్నాడు.

ఆరోజు వుదయం నర్సింతాత వుదయపు చల్లదనాన్ని నులక మంచం మీద పడుకొని కప్పుకొంటున్నాడు.

"మీకు సిగ్గులేదా... మరోసారి యిక్కడ యిలా బయట స్నానాలు చేసారంటే పోలీసోళ్ళకి చెపుతా. ఆక్రమించుకొన్న స్థలం నిమిషాల మీద లేపించేస్తా," అరుస్తున్నాడు ఫ్లాట్ నెంబర్ 101.

"యేమయిందయ్యా," నర్సింతాత కంగారుగా అడిగాడు.

"మీవాళ్ళంతా యిలా ఆరుబయట స్నానాలు చేస్తే యెలా. మా ఆడవాళ్ళు అటూ యిటూ తిరుగుతుంటారు. యిబ్బందవుతుంది," అన్నాడాయన.

ఆ అపార్ట్‌మెంట్ చుట్టూ ప్రహరీ వుంది. వాళ్ళు నడిచే దారీ కాదు. యీ యిబ్బంది యేమిటో అర్థంకాక నర్సింతాత అయోమయంగా, "మా యిళ్ళ ముందు కదయ్యా స్నానాలు చేస్తుంది" అన్నాడు.

"మా బెడ్‌రూమ్ బాల్కనీ మీ యింటి వైపుంది. మా యింట్లో వాళ్ళు బాల్కనీలోకి వొస్తే మీరంతా కనిపిస్తారు. అలాగే అటుపక్క వంటగది బాల్కనీలు మీ యిళ్ళ వైపే వున్నాయి. యిదంతా పెద్ద న్యూసెన్స్‌గా వుంది. మీ వాళ్ళెవరూ బయట స్నానాలు చేయకూడదు. యిలా యింకోసారి కనిపిస్తే న్యూసెన్స్ కేస్‌పెడతా," అన్నాడాయన.

వుండడానికే చిన్నచిన్న గదులు. స్నానాల గదికి స్థలం యెక్కడుంది. అనుకుం టూనే, "లేదులే బాబయ్యా, మేం బయట స్నానాలు చేయం," అని నర్సింతాత అతనిని బతిమాలుతున్నాడు.

"యేంటయ్యా ప్రతిదానికి మనమీద కొస్తాడు. యేంటి వాళ్ళకి భయపడేది. మనకి పట్టాలు త్వరగా యిమ్మను. అప్పుడు చూపిస్తా నా తడాఖా," అన్నాడు

నర్సింతాత మనవడు.

"ఆ పెద్దాళ్ళతో మనకేంటిరా!" అంటూ నర్సింతాత స్నానాలు చేయడానికి పాత తడికెలతో చిన్ని అడ్డు కట్టాడు. యిందులో యిరుక్కొని స్నానం చెయ్యాలాని మగాళ్ళంతా విసుక్కుంటూనే వున్నారు. యింటి ముందున్న నీడ తగ్గుతుంటే నర్సింతాత యూక్లిప్టస్ చెట్ల చిల్లుల నీడలో మంచం వేసుకొని పడుకొని వున్నాడు. పిల్లలంతా చేరి కథలు వింటున్నారు. నర్సింతాత నిద్రలోకి జారుకున్నాడు. పిల్లలు వొకొక్కరే మంచం దిగి ఆ చెట్ల మధ్యన దొంగాట ఆడటం మొదలెట్టారు. కేరింతలు కేరింతలుగా సాగుతోంది ఆట.

"యేమీ... బుద్ధిలేదు. యేంటా గోల. అటుపొండి," 409 ఫ్లాట్‌లోని ఆవిడ అరుస్తోంది.

"టి.వి. చూస్తుంటే మీ అరుపులే పడుకోనివ్వరూ. అరుపులే అరుపులు."

నర్సింతాత వులిక్కిపడి లేచాడు.

లేచిన కాసేపటికి పిల్లలు ఆడుకొంటుంటే వాళ్ళకి డిస్ట్రబెన్స్‌గా వుందని అర్థమయింది నర్సింతాతకి. "సర్లేమ్మా... పిల్లలు గొడవ చేయకుండా చూస్తా," యెప్పట్లానే బతిమాలుతున్నాడు.

"వాళ్ళు టీవీలు, టేప్ రికార్డర్లు పెట్టటంలేదా, చెవులు చిల్లులు పడేట్టు. సాయంకాలాలు వాళ్ళ పిల్లలు ఆడటం లేదా. యెప్పుడు చూసినా మన మీద యేడుపే," నర్సింతాత కోడలు కోపంగా అంది.

"వాళ్ళతో మనకెందుకమ్మా. వూరుకో..." అంటూ పిల్లలందరినీ దగ్గర కూర్చోపెట్టుకొని కథ చెప్పటం మొదలుపెట్టాడు నర్సింతాత. ఆరోజు నుంచి పిల్లలు మధ్యాహ్నం వేళ ఆడుకోవటం బంద్ అయిపోయింది.

వోరోజు వుదయమే యేజెంట్ పట్టా పత్రాలంటూ నర్సింతాతని తీసుకెళ్ళాడు. పట్టా పుచ్చుకొని నర్సింతాత యింటికి వచ్చాడు. యింటి ముందు ఆడవాళ్ళంతా గొడవగొడవగా మాట్లాడుకుంటున్నారు.

"యేమయింది" అని అడిగాడు నర్సింతాత.

"అటు చూడు," అంది మనవరాలు.

యీ యింటికి, అపార్ట్‌మెంట్ ముందున్న రోడ్డుకి మధ్య ఫెన్సింగ్ కడుతున్నారు.

"యెందుకు" అని అడిగాడు తాత.

"మనమంతా అటు నుంచి తిరుగుతుంటే గోలగా వుందంట," అంది చిన్న మనమరాలు.

యిళ్ళలో పనికి వెళ్ళాలన్నా, బోరింగు నుంచి నీళ్ళు తెచ్చుకోవాలన్నా, పిల్లలు బడికి వెళ్ళాలన్నా, దుకాణం నుంచి సరుకులు తెచ్చుకోవాలన్నా అదొక్కటే దారి. యెడమవైపంతా తోట.

"యెలా తిరగాలి" అడిగింది కోడలు.

'యీ తీగెల ఫెన్సింగ్‌ని యిటు నుంచి దాటి యీ తుమ్మచెట్లలోంచి ముందుకెళ్ళి రోడ్డెక్కాలి," అంది మరో మనవరాలు.

"ముళ్ళచెట్లు. చీకట్లో పురుగుపుట్రా వుంటుంది. అయినా చిటికెలో నడికి వెళ్ళొచ్చే దానికి యెంత చుట్టూ తిరగాలి. చిన్నపిల్లలు బడికి యెలా పోతారు," అంది పెద్ద కోడలు.

"పట్టా వచ్చిందిగా మనకేంటి భయం. అడుగుదాం," అంది పెద్ద కూతురు.

"వద్దులేమ్మా. పెద్దాళ్ళతో తగాదా యెందుకు. ఆ దారినే కాస్త బాగు చేసుకుందాం," అన్నాడు.

"యెంత కాదనుకున్నా మనది ఆక్రమించిన స్థలం అంటారు. పైవాళ్ళతో యెందుకొచ్చిన తగవు," అన్నాడు పెద్దల్లుడు.

ఆరోజు నుంచి నర్సింతాత పరివారమంతా ఆ ముళ్ళచెట్ల నడుమ నుంచి చిన్ని కాలిబాటని తయారుచేసుకున్నారు. రోజూ యెవరో వొకరికి ఫెన్సింగ్ తీగ ముళ్ళు గుచ్చుకోవటం, రాసుకోవటం, యిరుకు స్నానాలకి ముళ్ళదారికి ఆటలు లేని మధ్యాహ్నానికి అంతా అలవాటు పడిపోయారు.

"టి.వి. కొందాం... కొందాం," పిల్లలు ఆడవాళ్ళు అంతా తాత చుట్టూ చేరారు.

"టి.వి. కొనటం సరే... మనకి కరెంట్ లేదు కదా" అన్నాడు తాత. కరెంట్ యిప్పించమని యేజెంట్‌ని అడగమన్నారు.

"యేం పట్టానో, యేం కరెంటో. కష్టమంతా ఆ యేజెంట్‌కి పెట్టాల్సొస్తోంది," పెద్దకొడుకు విసుక్కున్నాడు.

నర్సింతాత ఆ యేజెంట్ చుట్టూ తిరిగి కాస్త డబ్బులిచ్చి యింటికి కరెంట్ కావా లన్నాడు.

ఆ సాయంకాలం అంతా చేరి నెగడు వేసుకొని రొట్టెలు తింటూ పాటలు పాడు తున్నారు. పాట వెనక పాట, పాటలే పాటలు. డప్పుపై దరువేస్తూ...

"యేమ్మా... యేంటా గోల, వెధవ న్యూసెన్స్..." నాలుగైదు ఫ్లాట్స్ వాళ్ళు కలిసి కట్టుగా కిందకొచ్చి అరవటం మొదలుపెట్టారు.

"మీరిలా పాటలు పాడుతోంటే నిద్రపోలేం. వేరే పనీ చేయలేం," అరుపులే అరుపులు.

బయటి నుంచి అప్పుడే అపార్ట్‌మెంట్‌లోకి వొస్తున్న రెండొందల వొకటో నెంబర్ అమ్మాయి, "పాటలు బాగ పాడతారు. పాడొద్దంటే యెలా," అంది.

"మీరేంటి వాళ్ళకి సపోర్ట్. మీరొక్కరే. మీకేం తెలుసు. వీళ్ళ వలన పిల్లలు చదువు కోలేకపోతున్నారు," గయ్యిమన్నాడు వో ఫ్లాట్ వోనర్.

"పాట వొద్దంటే యెలా... వాళ్ళ యిళ్ళలో వాళ్ళు పాడుకుంటుంటే వద్దనటం యేంటి," అందామె.

"మీకు వీళ్ళ సంగతి తెలీదు. అయినా మీకెందుకండీ వాళ్ళ గొడవ. మనమంతా వొకే అపార్ట్‌మెంట్‌వాళ్ళం. వొకే మాట మీదుండాలి. మీరు వెళ్ళండి. మనం తర్వాత మాట్లాడుకుందాం," అంటూ ఆమెని అక్కడ నుంచి పంపించటానికి ప్రయత్నించారు. ఆమె కదల్లేదు.

"మేం పాడం లేండయ్యా," తాత బతిమాలేస్తున్నాడు.

పచ్చని నిండైన చింతచెట్టు శాఖోపశాఖలుగా వొత్తైన నీడనిచ్చే చింతచెట్టు మొదల కంటా నరికేశారు. కాలనీలో అందరి అవసరాలని తల్లిలా ఆదుకొనే వేపచెట్టుని నరికేశారు. ఆటలన్నీ లాక్కున్నారు. దారి కట్టేశారు. సందడినంతా లాగేసుకున్నారు. యెవరు వీళ్ళు. వీళ్ళంటే తాతకి యెందుకింత భయం. తామంతా తాత మాట వింటారు. తాతేంటి వీళ్ళని కాళ్ళవేళ్ళ బతిమాలు కుంటాడు. యెందుకిలా... ఆలోచనలు రేలాలో.

"పోలీసోళ్ళకి ఫోన్ చేయండి. గవర్నమెంట్ ల్యాండ్. ఆక్రమించేశారు. పక్కవాళ్ళకి న్యూసెన్స్," అరుస్తున్నాడు వొకతను.

"పట్టా వుంది సార్."

"పట్టా, దొంగ పట్టా. అవేం చెల్లవ్," అన్నారింకొకరు.

"యెందుకయ్యా యింత గొడవ. మేం పాడం. డప్పు వేయం. మీకెలాంటి గొడవ వినిపించదు," బతిమాలుతూ, "పదండి యింట్లోకి," అన్నాడు తాత.

అపార్ట్‌మెంట్‌లోకి వాళ్ళు, చిన్నిచిన్న గదుల యిళ్ళలోకి వీళ్ళు వెళుతుండగా మండుటెండల్లో తొలివాన కురిసినప్పుడు నేలలోంచి వుబికి వెచ్చగా వొచ్చే మట్టి వాసన కమ్ముకొంటున్నట్టు, రేల పాడుతోన్న పాట మెల్లమెల్లగా చుట్టుకొంటోంది.

ఆ పాటని యెలా వదిలించుకోవాలో తెలియక వాళ్ళు అయోమయంగా దారులు వెతుకుతున్నారు. ఆశ్చర్యంగా ఆనందంగా ఆత్మీయంగా ఆ పాటతో స్వరం కలిపింది రెండొందల వొకటో నెంబర్ ఫ్లాట్‌లోని యువతి. రేల పాట మరింత వెచ్చగా గాఢంగా స్పష్టంగా ప్రవాహంలా... తొలివాన కురిసినప్పుడు నేలలోంచి వుబికి వెచ్చగా వొచ్చే మట్టివాసనలా కమ్ముకొంటోంది.



*మానవి త్రైమాసిక బులెటిన్*
*జనవరి-మార్చి 2003*